ప్రైవేటు ఆసుపత్రులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వికారాబాద్, ఫిబ్రవరి 19 : జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వాన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రిలో కాన్పులు చేసే వారు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేదంటే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఆస్పత్రుల్లో చేసిన కాన్పుల వివరాలను వెంటనే ఈబర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పోలియో రహిత సమాజమే లక్ష్యం

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి : కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మార్చి 3వ తేదీన బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 4 నుంచి 6వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి ఆశా వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చుక్కల మందు వేయాలని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సరస్వతి, శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాట్లు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబితాలోని డూప్లికేటు ఓటర్లను తొలగిస్తున్నామని, ప్రతివారం పొలిటికల్ పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రేపు కోస్గికి సీఎం రేవంత్‌రెడ్డి రాక

●అధికారులు పూర్తి సమాచారంతో ఉండాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి19 : ఈనెల 21న కోస్గిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా అధికారులతో మాట్లాడారు. బుధవారం కోస్గిలో సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనలు, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్లు భవనాలు, నీటి పారుదల, మిషన్ భగీరథ, ఎస్సీ, ఎస్టీ, విభాగాల అధికారులతో సంక్షేమ శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారాలతో ఉండాలని ఉండాలన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, లింగ్యానాయక్‌లు ప్రజల నుంచి 129 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలనుపరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.

సంగయపల్లి అడవి పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధారూరు, ఫిబ్రవరి 19: 'అడవి తల్లిపై గొడ్డలి వేటు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. ధారూరు రేంజ్‌లోని సంగయపల్లి తండా బీట్‌లో కొందరు చెట్లు నరికిన ప్రాంతాన్ని రేంజర్ కృష్ణ, సెక్షన్ అధికారి మొయినొద్దీన్ పరిశీలించారు. ఎకరాల మేర చెట్లు నరికి రాత్రికి రాత్రే నిప్పంటించారు. మంటలను ఆర్పేందుకు అధికారులు ఫైరింజన్‌ను రప్పించారు. అటవీ ప్రాంతంలో చెట్లను ముగ్గురు వ్యక్తులు నరికివేసినట్లు అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతాన్ని త్వరలోనే సర్వే చేస్తామని అధికారులు తెలిపారు.



దగ్ధమైన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ కృష్ణ

- నామినేటెడ్ పోస్టుల భర్తీకి కాంగ్రెస్ కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో భారీగా ఆశావహులు
- రేసులో పలువురు మాజీ ఎమ్మెల్యేలు
- ఆర్టీసీ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి పేరు పరిశీలన!
- ఎన్నికల్లో ఓడిన వారిలో సైతం ఆశలు

నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో అవకాశాలు దక్కని వారితో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని పార్టీ భావిస్తోంది. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన కొందరు నేతలు కూడా నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. వారంతా పార్టీ ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



పదవుల పండుగ!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండడంతో వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తోంది. సోమవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కీలక నామినేటెడ్ పోస్టుల విషయంలో అధిష్ఠానంతో కూడా చర్చించనున్నట్లు సమాచారం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇటీవలే 54 నామినేటెడ్ పోస్టులను రద్దు చేసిన విషయం తెలిసిందే. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన నామినేటెడ్ నియామకాలన్నింటినీ కూడా రద్దు చేసింది. ప్రస్తుతం రాష్ట్రస్థాయి పోస్టులతో పాటు జిల్లాస్థాయి, ఇతర పోస్టులు భారీగానే ఉన్నాయి. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు పెద్ద సంఖ్యలో ఉన్న మార్కెట్‌కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆలయ కమిటీలకు కొత్త పాలక వర్గాలను నియమించాలని నిర్ణయించారు. దీంతో ఈ పోస్టుల కోసం ఉమ్మడి జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల్లో అవకాశాలు దక్కని వారితో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని పార్టీ భావిస్తోంది.

రాష్ట్రస్థాయి పోస్టులకు...

రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులకు ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ డిమాండ్ ఉంది. మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, వంశీచందర్‌రెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు ఆశిస్తున్నారు. సుధీర్‌రెడ్డికి ఆర్టీసీ చైర్మన్ ఇస్తారనే ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది.


ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు

నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న వారంతా ఇపుడు పార్టీ ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేలు లేనిచోట ఎక్కువ నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కూడా పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు త్యాగం చేసిన వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొందరికి నామినేటెడ్ పోస్టు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి వారి సంఖ్య ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎక్కువగానే ఉంది. అయితే వీరందరికీ నామినేటెడ్ పదవులు ఇవ్వడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాల్‌గా మారనుంది. ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసిన వారితో పాటు పార్టీ కోసం కష్టపడుతున్న అనేక మంది పదవులు ఆశిస్తున్నారు. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీలో సామాజిక సమీకరణాలు కూడా కీలకం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని విభాగాల నుంచి కూడా జాబితా తీసుకుంటున్నారు. హామీలు ఇచ్చిన వారి జాబితాను తీసుకుని మదింపు చేస్తున్నారు.

రేస్‌లో వీరే..

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, మల్‌రెడ్డి రామిరెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బడంగపేట మేయర్ పారిజాత, చేవెళ్లకు చెందిన వసంతం, దర్శన్, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన రాచమల్లు సిద్దేశ్వర్, జ్ఞానేశ్వర్, ముంగి జైపాల్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాలో సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషన్ నాయక్, ఎర్రవల్లి జాఫర్, అబ్దుల్ రావూఫ్, నందారం ప్రశాంత్, నీరజా బాల్‌రెడ్డి, రవిగౌడ్, కృష్ణారెడ్డి, కృష్ణప్రసాద్, హన్మంత్ ముదిరాజ్, నందారం ప్రశాంత్ తదితరులు చైర్మన్, వైస్ చైర్మన్ లేదా డైరెక్టర్ పోస్టులు ఆశిస్తున్నారు.

ఇక వికారాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోస్టుల రేస్‌లో పలువురు ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే జిల్లాలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిసె లక్ష్మణ్‌తో పాటు సీనియర్ నేతలు మహిపాల్‌రెడ్డి, నర్సోత్తమరెడ్డి తదితరులు నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చెందిన మధుయాష్కీ గౌడ్, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్), భీం భరత్, మైనంపల్లి హన్మంతరావు, తోటకూర జంగయ్య యాదవ్, నరేందర్ కూడా నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. మరి, వీరిలో ఎవరికి అవకాశాలు దక్కుతాయో వేచి చూడాలి.



సేవాలాల్ ఆశయాలతో ముందుకు సాగాలి

● అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 19 : సద్గురు సేవాలాల్ మహరాజ్ భావాలు, ఆశయాలను అనుసరించి ప్రజలు ముందుకు సాగాలని రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో సద్గురు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్పీకర్ ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డిలతో కలిసి భోగ్ బండార్ పూజలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. ప్రజల సహకారంతో తండాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. వివిధ శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బంజారా కుటుంబాల్లో వెలుగు నింపిన సేవాలాల్ చిరస్మరణీయులని కొనియాడారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ చదువుని ఆయుధంగా మార్చుకొని సమాజంలో అన్ని రంగాల్లో బంజారా యువత రాణించాలని సూచించారు. ఆర్డీవో విజయ్‌కుమారి, కోటాజీ, లక్ష్మీనారాయణ, వినయ్‌కుమార్, జాకీర్‌అహ్మద్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ప్రసాద్ కుమార్

బీజేపీ విజయ సంకల్ప రథయాత్రకు
సర్వం సిద్ధం

- నేడు తాండూరులో శ్రీకారం
- హాజరుకానున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- ధారూరు, వికారాబాద్, పరిగి మీదుగా చేవెళ్లకు..
- రెండు రోజులు జిల్లాలో కొనసాగనున్న రథయాత్ర



వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు, ఫిబ్రవరి 19 : లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రకు నేడు తాండూరులో శ్రీకారం చుట్టనున్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని, తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో బీజేపీ విజయ సంకల్ప రథయాత్రలకు సన్నద్ధమైన విషయం తెలిసిందే. రాజరాజేశ్వరి క్లస్టర్ పరిధిలో మంగళవారం తాండూరులో శ్రీకారం చుట్టే ఈ రథయాత్ర నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా యాత్ర కొనసాగనుంది. తాండూరులో ప్రారంభమయ్యే విజయ సంకల్ప రథయాత్ర మార్చి ఒకటో తేదీన కరీంనగర్‌లో ముగియనుంది. మంగళవారం ఉదయం 11 గంటలకు విజయ సంకల్ప రథయాత్రను కేంద్ర మంత్రి బీఎల్ వర్మ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి, పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లాబాధ్యులు పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు ధారూరు మండల కేంద్రానికి రథయాత్ర చేరుకోనుంది. 5 గంటలకు వికారాబాద్‌కు చేరుకోనున్న రథయాత్రలో బీజేఆర్ చౌరస్తాలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాత్రి వికారాబాద్‌లోనే బస చేయనున్నారు. బుధవారం ఉదయం వికారాబాద్‌లో నిర్వహించే సమావేశంలో మాట్లాడతారు. అనంతరం నస్కల్ మీదుగా పరిగి చేరుకోనుంది. అక్కడ నిర్వహించే సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం మన్నెగూడ మీదుగా చేవెళ్లకు చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేయనున్నారు.

నాపరాయి పరిశ్రమ కుదేల్!

● కర్ణాటకకు తరలిపోతున్న కంపెనీలు ● రాయల్టీ, లీజుల్లో భారీ వ్యత్యాసం
● గ్రానైట్‌పై 40శాతం రాయితీ ఎత్తివేత ● వ్యాపారుల విలవిల.. కార్మికులకు ఉపాధి కరువు

తాండూరు, ఫిబ్రవరి 19: తాండూరులో నాపరాయి పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం, తెలంగాణ రాష్ట్రంలో రాయల్టీ, గనుల లీజు పొందే విషయంలో తీవ్ర వ్యతాసం ఉండడంతో నాపరాయి పరిశ్రమలు కర్ణాటక రాష్టానికి తరలిపోతున్నాయి. ప్రత్యేక్షంగా, పరోక్షంగా నాపరాయి వ్యాపారంపై 25 వేల మంది ఆధారపడ్డారు. లైమ్‌స్టోన్, స్లాబ్‌ల కోసం సిగ్నయారేజ్‌పై 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేది. సిగ్నియారేజ్ రాయితీ గడువు జనవరి 25వ తేదీతో ముగినా తిరిగి 40 శాతం మినహాయింపుతో గడువును సర్కారు పొడిగించలేదు. కర్ణాటకలో రాయల్టీ ఫీజు రూ.800 ఉండగా తాండూరులో నాపరాయిపై రాయల్టీ రూ.1100 ఉన్న దానిని రూ. 2850కి పెంచారు. గని లీజు పొందాలంటే రూ.18 లక్షలు, మరొకరి పేరున మార్చాలంటే రూ.8లక్షల వ్యయం అవుతుంది. క్వారీ లీజుల పునరుద్ధరణ, క్వారీలీజు బదిలీ దరఖాస్తు ఫీజులు వందశాతం పెరిగింది. తాండూరుకు 14కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉంది. అక్కడి రాయల్టీ ధరలు చాలా తక్కవగా ఉండటంతో చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయి. తాండూరులో క్వారీ లీజు, పర్యావరణ క్లియరెన్స్ పొందేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. అంతేకాకుండా తాండూరు మండలం జినగుర్తిలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు కొన్నేళ్లుగా పరిశీలనలో ఉంది. ఈపార్కు ఏర్పాటైతే 500 పాలిషింగ్ యూనిట్లన్నీ ఒకే చోట ఉండడంతో కార్మికులకు ఉపాధి లభిస్తుంది.



తాండూరులో నాపరాళ్లను పాలిషింగ్ చేస్తున్న కార్మికులు

ప్రభుత్వం ఆదుకోవాలి

నాపరాతి పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలి. గ్రానైట్‌పై 40 శాతం రాయితీని మరో రెండేళ్ల పొడిగించాలి. నాపరాయి రవాణాకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాలు లేన్ల రోడ్డు విస్తరణకు కృషి చేయడం, అసెంబ్లీలో మా సమస్యపై జీరో అవర్‌లో మాట్లాడటం శుభపరిణామం.



- అబ్దుల్ రవూఫ్, క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు



నాపరాతి గనులు

ప్రభుత్వం దృష్టి సాధిస్తే మనుగడ

జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టి పెట్టి సమస్య పరిష్కరిస్తే నాపరాయి పరిశ్రమ మనుగడ సాధించే అవకాశం ఉంది. ఇప్పటికే తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. తాండూరులో విస్తారమైన ఖనిజ సంపద ఉందని, ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న నాపరాయిపై రాయల్టీ తగ్గించాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతకు దరఖాస్తుల ఆహ్వానం

● లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంబాబు

వికారాబాద్, ఫిబ్రవరి 19: జిల్లా స్థాయి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 'నేను రాత్రికి రాత్రే మిలియనీర్‌గా మారితే డబ్బునెలా ఉపయోగిస్తాను' అనే అంశంపై వ్యాసరచన, 'సమ్మేళనం, పొదుపుశక్తి' అనే అంశంపై నినాదాలు, 'డిజిటల్ సైబర్' అనే అంశంపై పోస్టర్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారి పేరు, ఇతర వివరాలను దరఖాస్తులో పొందుపర్చాలని సూచించారు. విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఈనెల 22న సాయంత్రం 5గంటలలోపు లీడ్ బ్యాంక్ మేనేజర్, ఈ మెయిల్ idm.vikarabad@gmail.comకు వివరాలు పంపించాలని సూచించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు


పుట్టపహాడ్‌లో శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ జయంతిని అంతటా ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యం లో శోభాయాత్ర నిర్వహించారు. కులకచర్ల మండలం పుట్టపహాడ్‌లో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆవిష్కరించారు. శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, జడ్పీటీసీ రాందాస్‌నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్‌గౌడ్, భాస్కరయోగి, రాజప్ప, పీరంపల్లి రాజు, హరికృష్ణ, కృష్ణయ్యగౌడ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. ముజాహిద్‌లో శివాజీ జయంతిని నిర్వహించారు. గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానికులు శ్రీనివాస్, చంద్రభూపాల్, సోమలింగం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్/దౌల్తాబాద్ : కొడంగల్ పరిధి గుండ్లకుంటలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తూ శివాజీ ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణంరాజు, ప్యాక్స్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ ఉషారాణి పాల్గొన్నారు. రాత్రి శివాజీ యువసేనసభ్యులు శోభాయాత్ర నిర్వహించారు. నృత్యాలు చేశారు. దౌల్తాబాద్‌లో వక్తలు మాట్లాడుతూ యువత శివాజీ ఆశయ సాధన కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు.

దౌల్తాబాద్/మోమిన్‌పేట్/దోమ : దౌల్తాబాద్ మండలం చల్లాపూర్‌లో శివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. హనుమాన్ ఆలయం నుంచి శివాజీ చౌక్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. మోమిన్‌పేట్, మండల పరిధి గ్రామాల్లో శివాజీ జయంతిని నిర్వహించారు. ఆర్‌ఎస్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ శివాజీ ధైర్య సాహసాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మల్లేశం, బి.రాజు, శ్రీనివాస్, మురళీమోహన్, శ్రీకాంత్, సాయిరాం, మల్లారెడ్డి పాల్గొన్నారు. దోమ, బొంపల్లి, అయినాపూర్ గ్రామాల్లో శివాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అయినాపూర్‌లో శివాజీ విగ్రహానికి గ్రామస్తులు పూల మాలలు వేశారు. బొంపల్లి ఎంపీటీసీ రాములు, రిటైర్డ్ ఏఎస్సై అంతిరెడ్డి, యువత పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ప్రతీ ఒక్కరు శివాజీ స్ఫూర్తితో మెలగాలని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ జయదేవ్ అన్నారు. దుద్యాల మండలం పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయ కూడలి వద్ద శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.

యాలాల: చెన్నారం, అక్కంపల్లి, అన్నాసాగర్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు. జుంటుపల్లిలో శివాజీ జయంతి వేడుకల్లో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు రాజుగౌడ్, విఠల్, సిద్రాల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


పూడూరు: పెద్ద ఉమ్మెంతల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మేడ్చల్: మునీరాబాద్‌లో శివాజీ జయంతిలో పాల్గొన్న నాయకులు, యువకులు

బంట్వారం(కోట్‌పల్లి): కోటిపలి, బంట్వారం, మండలాల్లోని గ్రామాల్లో శివాజీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేశారు. శివాజీ మొఘలుల సామ్రాజ్యాన్ని గడగడలాడించాడని, దేశాన్ని రక్షించిన మరాఠా మహరాజ్ శివాజీ అన్నారు. కార్యక్రమాల్లో కోట్‌పల్లి భజరంగ్‌దళ్ యువసైన్యం పాండు, రాజు, సుధీర్, ప్రణయ్, మహేష్, నిఖిల్, కిరణ్, సంతు, భాస్కర్, కె.శివకుమార్, రమేష్ పాల్గొన్నారు

వికారాబాద్: ఛత్రపతి శివాజీ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మునిసిపల్ పరిధి మద్గుల్ చిట్టంపల్లిలో శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళ్లు అర్పించారు. కౌన్సిలర్ గోపాల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శివాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆలంపల్లి అనంత పద్మనాభస్వామి ఆలయం నుంచి చౌరస్తా, ఎంఆర్‌పీ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా మీదుగా హనుమాన్ ఆలయం వరకు ర్యాలీని నిర్వహించారు.స్పీకర్ పాల్గొని మాట్లాడుతూ మొఘలులు భారతదేశంపై దండయాత్ర చేసిన సమయంలో శివాజీ వారిని ఎదుర్కొని మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. తన రాజ్యంలోని స్త్రీలను గౌరవించుకుంటూ అన్ని వర్గాలకు సమానత్వాన్ని కల్పించిన యోధుడు శివాజీ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుక

ఘట్‌కేసర్: మొఘల్ సామ్రాజ్య పతనాన్ని శాసించిన పరాక్రమవంతుడు శివాజీ అని ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి శివాజీనాయక్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రసాద్, నాగరాజు, అజయ్, కార్తీక్, వినోద్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించి వీబీఐటీ కళాశాల నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మల్లేష్, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు 9వ వార్డులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాగా దీప, కాలనీవాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై నిలిపిన శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పట్టణంలో ఛత్రపతి శివాజీ అభిమానుల, హిందూ సమాజ ప్రతి నిధులు శివాజీ విగ్రహాన్ని ఊరేగించారు. కాళికాదేవి ఆలయం నుంచి పట్టణంలోని చౌరస్తాల మీదుగా శివాజీ చౌక్ వరకు ఊరేగింపు కొనసాగింది. కార్యక్ర మంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నాయకులు మురళీగౌడ్, రాజుగౌడ్, డాక్టర్ సంపత్ కుమార్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: చెంగోల్‌లో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు రాముయాదవ్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. బావనోళ్ల హన్మయ్య, నారాయణరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మల్లేష్, నరేష్, నర్సింహులు, బాల్‌రాజ్, మహిపాల్ పాల్గొన్నారు. చిట్టిఘనాపూర్‌లో మాజీసర్పంచ్ మంజురాణి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అధ్యాపకుడు వెంకట్రాములుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

పరిగి: శివాజీ జయంతి వేడుకలను పరిగిలో జరుపుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటంతో శోభాయత్ర నిర్వహించారు. లక్ష్మీవేంకటేశ్వర ఆలయం నుంచి బాహార్‌పేట్, హనుమాన్ ఆలయం, మున్నూరువాడ మీదుగా తహసీల్దార్ కార్యాలయం మీదుగా శోభాయాత్ర సాగింది. ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, నాయకులు కృష్ణ, రామకృష్ణ, అంజనేయులు, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ మండలం మునీరాబాద్‌లో శివాజీ జయంతిని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనాద్‌రెడ్డి, బాబు, జంగారెడ్డి, మధు, వేణు పాల్గొన్నారు.

పూడూరు: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని పెద్ద ఉమ్మెంతల్‌లో నెలకొల్పిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శివాజీ అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆలంపల్లిలో శివాజీ మహరాజ్ శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


తాండూరు సాయిపూర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


గుండ్లకుంటలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి

ప్యాక్స్ చైర్మన్‌కు ఎమ్మెల్యే సన్మానం


పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 19: కులకచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన మొగులయ్యను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు. సోమవారం మొగులయ్య ఎమ్మెల్యేను కలిసిన సందర్భంగా సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉంటూ రుణాలను మంజూరు చేసి, పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్-బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆనందం, వెంకటయ్యగౌడ్, విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

నూతన ఎస్సైని సన్మానించిన బీజేపీ నాయకులు



కులకచర్ల, ఫిబ్రవరి 19: కులకచర్ల సీఐ‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంజిలయ్య, మాజీ సర్పంచ్ జానకిరామ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు మహిపాల్, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కీసర ఆర్డీవోగా ఉపేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


ఆర్డీవో ఉపేందర్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేస్తున్న కీసరగుట్ట అర్చకులు

కీసర, ఫిబ్రవరి19: కీసర రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో)గా వెంకట ఉపేందర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అధి కారి కీసరగుట్ట రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదం, శేషవస్త్రాలు, దేవుడి ఆశీర్వచనాలు అందజేశారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

పరిగి, ఫిబ్రవరి 19 : క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పరిగి ఖోఖో జట్టు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పరిగి జట్టు రన్నర్‌గా నిలవగా టీమ్‌ను సోమవారం ఎమ్మెల్యే సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ డి.మాణిక్యం, కాంగ్రెస్ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, డీసీసీ కార్యదర్శి ఎన్.రామకృష్ణ, కోచ్‌లు స్వాతి, పుష్ప ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

పూడూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పూడూరు, కండ్లపల్లి, బాకాపూర్, గడ్డుపల్లి, మంచన్‌పల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. తనకు ఓట్లు వేసిన ప్రజలకు రుణపడి ఉంటానని, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని చెప్పారు. మంగళవారం మొయినాబాద్‌లో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్యాక్స్ చైర్మన్ సతీష్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, ప్రజలు పాల్గొన్నారు.

రూ.25.64కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం


తాండూరు మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్

తాండూరు, ఫిబ్రవరి 19 : తాండూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం వాడివేడిగా జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.25కోట్ల 64లక్షల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు హాజరయ్యారు. ప్రారంభ నిల్వ రూ.5.38 కోట్లు ఉండగా ఈ ఏడాది రూ.20.26కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. వ్యయం రూ.39.25కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. పార్కులు, జంక్షన్‌ల అభివృద్ధికి రూ.25లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.47లక్షలు, ఆట స్థలాలు, ప్రజా మూత్రశాలల నిర్వహణ, వైకుంఠధామాలకు రూ.10లక్షల చొప్పున కేటాయించారు. కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐలకు రూ.6కోట్లు కేటాయించారు. మెటీరియల్ కొనుగోలుకు రూ.25లక్షలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అమలుకు రూ.5లక్షలు, పవర్ చార్జీలకు రూ.1.8కోట్లు కేటాయించారు.

వార్డుకు రూ.కోటి నిధులపై సమావేశంలో చర్చ

గత ప్రభుత్వం వార్డుకు రూ.కోటి నిధులు కేటాయించిన అంశాన్ని కౌన్సిలర్లు ప్రస్తావించారు. ఆ పనులే ప్రారంభం కాలేదన్నారు. దీంతో వాదోపవాదాలకు దారి తీసింది. పనుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పర్సపర వాదనలకు దిగారు. ఎమ్మెల్యే జోక్యంచేసుకొని అందరం కలిసి పనిచేద్దామని సముదాయించడంతో సద్దుమణిగింది. వైస్ చైర్‌పర్సన్ దీప, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, డీఈఈ ఖాజాహుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఎక్స్‌అఫీషియో పాల్గొన్నారు.

మోడీ చొరవతోనే గ్రామాల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న కె.విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 19 : ప్రధాని నరేంద్రమోడీ చొరవతోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో బీజేపీ పనిచేస్తోందన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్ర మంగళవారం తాండూరులో ప్రారంభమై వికారాబాద్ చేరుకుంటుందన్నారు. మూడు రోజుల పాటు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో తిరుగుతుందని, శేరిలింగంపల్లిలో ముగింపు సభ నిర్వహిస్తామని తెలిపారు. యాత్ర ప్రారంభానికి కేంద్ర మంత్రి డీఎల్‌వర్మ, ఎంపీ బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. త్వరలో బీజేపీలో భారీగా చేరికలుంటాయని ఆయన చెప్పారు. నేటి విజయ సంకల్పయాత్రకు ప్రజలు తరలొచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

పరిగి డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

పరిగి,ఫిబ్రవరి 19: పోలీస్ కార్యాలయాలను సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.వెంకటయ్య, రాథోడ్ శ్రీనివాస్, గోవింద్‌నాయక్ మాట్లాడుతూ సివిల్ తగాదాల్లో తలదూర్చుతూ పేదలకు అన్యాయం చేస్తున్న పరిగి డీఎస్పీ, దోమ ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలన్నారు. దోమమండలం తిమ్మాయిపల్లిలో అయ్యూబ్ అనే రైతుకు చెందిన భూమిని ఇతరులు కబ్జా చేసేందుకు పోలీసులే కారణమన్నారు. పోలీసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మక్కై అమాయకులకు మోసంచేస్తున్నారన్నారు. అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు పీఎస్‌కు వెళ్తే ఎస్ఐ రవి ఫిర్యాదు తీసుకోవాలంటే డబ్బులు అవుతాయని ఫోన్‌పే ద్వారా రూ.30 వేలు తీసుకున్నాడని తెలిపారు. గతంలో రాఘవాపూర్ భూముల విషయంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి తన కార్యాలయంలోనే సెటిల్ చేసి, ఇప్పటి వరకు డబ్బులు ఇప్పించలేదన్నారు. పరిగి పోలీసు అధికారులు సివిల్ కేసుల్లో అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎండీ హబీబ్, వెంకటయ్య, అనిల్, మక్బూల్, అయ్యూబ్, అమీర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని, వైస్ చైర్మన్ పల్గుల మాధవరెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 19 : ఎండ కాలం సమీపించినందున మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాయలంలో తాగునీటి సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజురోజుకు ఎండల అధికమవుతున్నందున నీటి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది కాబట్టి అవసరాలకు మేరకు నీటిని సరఫరా చేయాలన్నారు. పైపులైన్లు, బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్‌మెన్ అప్రమత్తంగా ఉంటూ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పి.మాధవరెడ్డి, కమిషనర్ సాబెర్ అలీ, కౌన్సిలర్లు, వాటర్ మెన్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

బొంరాస్‌పేట్/దౌల్తాబాద్, ఫిబ్రవరి 19: సీఎం హోదాలో మొదటి సారిగా బుధవారం కొడంగల్ నియోజకవర్గ పర్యటనకు వస్తున్న రేవంత్‌రెడ్డి పర్యటనను కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ దుద్యాల, బొంరాస్‌పేట్ మండలాల అధ్యక్షులు ఆవుటి శేఖర్, నర్సిములుగౌడ్ పిలుపునిచ్చారు. దౌల్తాబాద్‌లో మండల నాయకులు బోడి వెంకటరెడ్డి, వెంకట్రాములు, రాములు, దస్తప్ప సోమవారం వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి పనుల శంకుస్థాప కార్యక్రమాలకు సీఎం వస్తున్నారని తెలిపారు. 21న కోస్గిలో జరిగే సీఎం బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు భారీగా హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. అంజిల్‌రెడ్డి, రాజేశ్ రెడ్డి, మల్లికార్జున్, జయకృష్ణ, వెంకట్రాములు గౌడ్, రాంచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకటయ్య, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.


దుద్యాల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా జ్యోతిర్లింగ పడిపూజ



తాండూరు రూరల్, ఫిబ్రవరి 19 : మండలంలోని చిట్టిఘనాపూర్‌లో మల్లికార్జున ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శివస్వాములు 108 కలశాలతో ఆంజనేయస్వామి ఆలయం నుంచి శివాలయం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం శివస్వాముల కల్యాణం, మహా ఘటాభిషేకం నిర్వహించారు. కర్ణాటకలోని కల్బుర్గి జిల్లా జేవరిగి ప్రాంతానికి చెందిన శడాక్షరి వాసుదేవ శివయోగిస్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివస్వాములు జ్యోతిర్లింగ పడిపూజ, కల్యాణోత్సవానికి తరలివచ్చి శివ కల్యాణాన్ని తిలకించారు. శివస్వాములు, బెల్కటూర్‌కు చెందిన మల్లికార్జున్, రవికుమార్ పాల్గొన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా 40 మంది రక్తదానం

పెద్దేముల్, ఫిబ్రవరి19 : పెద్దేముల్‌కు చెందిన సుద్ద వ్యాపారి కోహీర్ రాజు కుమారుడు ఉదయ్‌కిరణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం జిల్లాసుపత్రి రక్తనిధి కేంద్రం ద్వారా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వివిధ గ్రామాల యువకులు 40మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్, కోహీర్ రాజు, రవికుమార్ పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

సంక్షిప్తంగా...

● **తాండూరు రూరల్:** మండలంలోని చింతామణిపట్నంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు, స్వామీ వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సీసీ రోడ్లకు రూ.5లక్షలు మంజూరు చేశారని, ఆ పనులను మండల ప్రత్యేకాధికారి వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందని రాము తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ రవి, రమేష్, బాలకృష్ణ, నర్సింహులు గౌడ్, లక్ష్మీకాంతరెడ్డి తదితరులున్నారు.

● **వికారాబాద్:** తెలంగాణ లెక్చరర్స్ ఫోరం 2024 క్యాలండర్‌ను తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బస్వరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి గోపాల్, వెంకటేశం, సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్‌లోని మాధవరెడ్డి వంతెన సమీపం నుంచి ఎదులాబాద్ రోడ్డులోని భూగర్భ వంతెన వరకు గల లింకు రోడ్డును అభివృద్ధి చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ కె.మల్లేష్ చైర్‌పర్సన్ పావని, కమిషనర్ సాబెర్ అలీకి వినతిపత్రమిచ్చారు. రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నందున ఘట్‌కేసర్ మీదుగా వెళ్లాల్సిన వాహనాలను మాధవరెడ్డి వంతెన కింది నుంచి మళ్లించినట్లు తెలిపారు. వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు పాడై దుమ్ముతో కాలనీల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు.

● **తాండూరు రూరల్:** మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈవో వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని టీచర్లకు సూచించారు. ఆయన వెంట పరిశీలకులు ఆరాధన, అంజిలయ్య, వైద్యనాథ్ ఉన్నారు.

పూడూరు: బాటసారులు, పశువుల కాపరులు, రైతులు ఎవరైనా అటవీ ప్రాంతంలో వెళ్తున్నపుడు సిగరెట్లు, బీడీలు తాగిగడ్డిపై పారేయొద్దని మండల బీట్ ఆఫీసర్ వీరబాబు సూచించారు. ఆయన మాట్లాడుతూ ఎండాకాలం ప్రారంభమవుతున్నందున అడవిలో ఎలాంటి వేడి వస్తువులు పారేసినా అడివంతా దగ్ధమవుతుందన్నారు. రెండు, మూడు రోజులుగా దామగుండం పరిసరాల్లో బీడీలు తాగి పారవేయడం వల్లే అడవిలో నిప్పంటుకుందన్నారు.

● **వికారాబాద్:** ఈ నెల 21 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ ఆర్టిలరీ సెంటర్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ విభాగాల్లో బాలురకు అడ్మిషన్‌కు ఆలిండియా ఓపెన్ సెలెక్షన్ నిర్వహిస్తారని జరుగుతుందని యువజన క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు తెలిపారు. శారీరక సామర్థ్య, సాంకేతిక నైపుణ్య పరీక్షలుంటాయన్నారు. బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్‌తో మెడికల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. పాల్గొనాలనుకునే వారు 8ఏళ్ల నుంచి 14ఏళ్లలోపు ఉండాలని, ఇంగ్లీష్, హిందీల్లో పరిజ్ఞానంతో పాటు 3వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 21న ఉదయం ఓపెన్ సెలక్షన్స్ ట్రయల్‌కు హాజరు కావాలన్నారు.

● **బొంరాస్‌పేట్:** అభివృద్ధి పనుల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జున్ అన్నారు.నాందర్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో దశల వారీగా పనులను కొనసాగిస్తామని తెలిపారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** మానసిక ప్రశాంతతకు యువతకు అవగాహన కల్పించాలని సెంట్రల్ యూనివర్సిటీ సైకాలజీ విభాగ హెచ్‌వోడీ పద్మజ అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో సైకాలజీ సంఘం, ఏడీఏ ఇండియా నిర్వహించిన యూత్ వెల్నెస్ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఉద్వేగాలను అదుపుచేసుకునేందుకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. యువతలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, నివారణకు తల్లిదండ్రులు, అధ్యాపకులు సూచనలివ్వాలన్నారు.

బొంరాస్‌పేట్/ధారూరు/శామీర్‌పేట: బొంరాస్‌పేట్ నూతన తహసీల్దార్‌గా పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కలెక్టరేట్ నుంచి తహసీల్దార్‌గా వచ్చారు. ధారూరు తహసీల్దార్‌గా సజీదా బేగం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లోని ఇరిగేషన్ కంప్లీట్ ఏరియా డెవలప్‌మెంట్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. శామీర్‌పేట తహసీల్దార్‌గా పి.యాదగిరిరెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఆయన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నుంచి బదిలీపై శామీర్‌పేటకు వచ్చారు.

● **మూడుచింతలపల్లి** : మూడుచింతలపల్లికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డిని మాజీ సర్పంచ్ జామ్ రవి, ఎంపీటీసీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. పలు అంశాలపై చర్చించారు.

● **కొడంగల్:** శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఒలింపియాడ్ ఎగ్జామ్‌లో కొడంగల్‌లోని నవీన ఆదర్శ కాన్వెంట్ విద్యార్థులు జిల్లాస్థాయి అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాజీ ఐఏఎస్ జయప్రకాశ్‌నారాయణ చేతుల మీదుగా ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు అకిత, సాయిశ్రీ, రాజు, అభిషేక్ అవార్డులు అందుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అమరేశ్, పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్ పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే షరీఫ్ హజ్రత్ శంషాఖాద్రీ దర్గా ఉత్సవాలు మంగళవారం(నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. 22 వరకు ఉత్సవాలు జరుగుతాయని దర్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ మస్తాన్,ఉపాధ్యక్షుడు మహమూద్ తెలిపారు. ఉత్సవాలకు స్థానికులు, తాండూరు, కొడంగల్, పరిగిల నుంచి భక్తులు తరలివస్తారు.

● **ఘట్‌కేసర్ రూరల్** : ఎదులాబాద్‌లోని రుక్మిణీ,సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజు తెలిపారు. 20న తొళక్కంతో ఉత్సవాలు ప్రారంభమై 24న విమాన రథోత్సవం, 25న చక్రతీర్థంతో ముగుస్తాయన్నారు.

పరిగిలో కుళ్లిన చికెన్ అమ్మకం


కుళ్లిన చికెన్ ఇదే

పరిగి, ఫిబ్రవరి 19: పరిగిలో కల్తీ మటన్ అమ్మకాల ఘటన మరువకముందే కుళ్లిన చికెన్ విక్రయాల ఘటన సోమవారం వెలుగుచూసింది. పరిగిలో గల స్నేహ చికెన్ సెంటర్‌లో సోమవారం వినయ్‌రెడ్డి చికెన్ కొనేందుకు వెళ్లారు. తీసుకున్న చికెన్‌ను పరిశీలించడగా అది దుర్వాసన వచ్చింది. దీంతో వ్యాపారిని నిలదీశాడు. కుళ్లిన చికెన్‌ను అమ్ముతున్నాడని వినయ్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతిచెందిన వృద్ధుడు

కీసర, ఫిబ్రవరి 19 : గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కీసర మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం పరిధి సత్యనారాయణ కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడి(60)ని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన వృద్ధుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. వృద్ధుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.